క్లుప్తంగా

సమస్యలుంటే తెలియజేయండి


కడలి పెద్దిరాజు

నరసాపురం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమస్యలుంటే తెలియజేయాలని పార్టీ నరసాపురం నియోజకవర్గ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కడలి పెద్దిరాజు సూచించారు. గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా నియిమితులైన ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలకు కూటమి నేతల నుంచి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పార్టీ అధినాయకులతో మాట్లాడతామని, కష్టం వచ్చిన కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పడుతున్న కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

పావలా వడ్డీకే విద్యా రుణం


మాట్లాడుతున్న బ్యాంకు ఏజీఎం

నరసాపురం రూరల్: డ్వాక్రా మహిళలకు స్త్రీ నిధి బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు ఏజీఎం కృష్ణమ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే డ్వాక్రా మహిళల పిల్లలకు పావలా వడ్డీకే రూ.లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. డ్వాక్రా మహిళలు తమ కుమార్తెల వివాహానికి అవసరమైన మొత్తాలను రూ.లక్ష వరకు పావలా వడ్డీకే అందిస్తున్నామని వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నరసాపురం మండలంలోని 6,993 మంది డ్వాక్రా మహిళలకు రూ.4.70 కోట్లు రుణాలను అందించామని తెలిపారు. స్త్రీనిధి బ్యాంకు మేనేజర్ చిట్టిబాబు, నరసాపురం ఏపీఎం జక్కంపూడి నాగభూషణ నాయుడు తదితరులు ఉన్నారు.

చర్చిలపై సర్వే తగదు

పాలకొల్లు సెంట్రల్: రహదారుల పక్కనున్న చర్చిల్లో అనుమతి ఉన్నవి లేనివి సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే డిగుపాటి రాజగోపాల్ బుధవారం తీవ్రంగా ఖండించారు. పంచాయతీరాజ్‌లో అనేక శ్మశాన వాటికలు, స్థలాలు, పోరంబోకు స్థలాలు అక్రమాలకు గురై పెత్తందారుల చేతిలో ఉన్నాయని, ముందుగా వాటిని సర్వే చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక పెత్తందారీ ఆక్రమణలో ఉన్న యలమంచిలి మండలం చించినాడలో 70 సెంట్ల దళితుల శ్మశాన వాటికపై ఎన్ని పిటిషన్లు వేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. బీజేపీని ప్రసన్నం చేసుకోవడానికి విడుదల చేసిన జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు మద్యం షాపుల లాటరీ

పాలకొల్లు సెంట్రల్: ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడిన గీత కులాల మద్యం షాపులు లాటరీ గురువారం తీయనున్నట్టు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో లాటరీ తీస్తామని, దరఖాస్తుదారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

సీఎండీఎఫ్ పనులకు గ్రహణం

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.1.35 కోట్లు విడుదల
- కూటమి సర్కార్ రాకతో పనులకు బ్రేక్


అభివృద్ధి జరుకుండా మధ్యలో పనులు నిలిచిపోయిన అంజుమన్ భవనం

నరసాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గద్దె దిగిన తరువాత అధికారం చేపట్టిన కూటమి సర్కార్ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లే అంశంలో వివక్షతో వ్యహరిస్తోంది. ఇప్పటికే నరసాపురంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన పలు ప్రాజెక్టులు నిలిచిపోయాయి. ఈ కోవలోకి సీఎండీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు కూడా చేరాయి. నరసాపురంలో వివిధ కమ్యూనిటీ భవనాలు, మంచినీటి పథకాలకు సీఎండీఎఫ్ (చీఫ్ మినిస్టర్ డెవలెప్‌మెంట్ ఫండ్స్) నుంచి వైఎస్సార్ సీపీ హయాంలో రూ.1.35 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి జీవోఎంఎస్ 106, 70లను ప్రభుత్వం ఇచ్చింది. ఈ నిధులతో పనులు మొదట వేగంగా సాగాయి. తరువాత ఎన్నికల కోడ్ రావడం, తరువాత ఎలక్షన్, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి.

నిలిచిన పనుల వివరాలివీ..

- రూ.25 లక్షలతో 16వ వార్డులోని అంజుమన్ భవనం పై అంతస్తు అభివృద్ధి
- 8వ వార్డులో రూ.10 లక్షలతో బీసీ కమ్యూనిటీహాల్ అభివృద్ధి
- మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఓహెచ్ఆర్ నిర్మాణాలకు రూ.20 లక్షలు
- నరసాపురం పట్టణం 14వ వార్డులో హిందూ శ్మశానవాటిక అభివద్ధికి రూ.39 లక్షలు కేటాయింపు
- కొత్త నవరసపురంలో ఎస్సీలకు మంచినీటి సరఫరా అభివృద్ధి పనుకు రూ.5 లక్షలు
- పాతనవరసపురం, కొత్తనవరసపురం, మల్లవరం, మల్లవరం లంక గ్రామాల్లో ఎస్సీలకు మంచినీటి పైప్‌లైన్ల అభివృద్ధి, సీడబ్ల్యూఎస్ స్కీమ్స్‌లో అభివృద్ధి పనులకు రూ.18 లక్షలు కేటాయింపు

ఒక్క ప్రాజెక్ట్‌లోనూ కదలిక లేదు



వైఎస్సార్ ప్రభుత్వంలో నరసాపురంలో భారీ అభివృద్ధి ప్రాజెక్టులు మంజూరు చేసింది. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, రూ.220 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వశిష్ట వంతెన లాంటి ప్రాజెక్టులు ప్రభుత్వం మారిన తరువాత నిలిచిపోయాయి. ఇది చాలా దారుణం. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నరసాపురం రూపు రేఖలు మారతాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– మల్లాడి బుజ్జి, నరసాపురం

పనులను పునఃప్రారంభించాలి



సీఎండీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోవడం దారుణం. ఈ నిధులతో చేపట్టిన పనులతో శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లు అభివృద్ధి చెందుతాయని అనుకున్నాం. పాత ప్రభుత్వానికి పేరు వస్తుందని, నిధులుండి కూడా అభివృద్ధి పనులను నిలిపివేయడం దారుణం. ఇప్పటికైనా నిలిచిపోయిన అభివృద్ధి పనులు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కొల్లాబత్తుల రవి, ఏఎంసీ మాజీ చైర్మన్

ఎండలతో ఉపాధి కూలీల విలవిల

- పని ప్రాంతాల్లో రక్షణ కరువు
- తీవ్ర అస్వస్థతకు గురవుతున్న కూలీలు


దేవలో ఎండలోనే చెరువు పూడిక తీత పనులు చేస్తున్న కూలీలు


అస్వస్థతకు గురై మృతి చెందిన పిల్లి లక్ష్మి (ఫైల్)

పెనుగొండ: వేసవి రాకముందే మండుతున్న ఎండలతో ఉపాధి కూలీలు విలవిల్లాడుతున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గంలో పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు ప్రాంతాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. మంచినీటి చెరువుల తవ్వకాలు ప్రారంభించారు. అయితే, ఎండల తీవ్రతరమవ్వడం, అందుకు అనుగుణంగా రక్షణ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీనికి తోడు ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురావడంతో కూలీలు దిక్కుతోచని పరిస్థితి ఎదురౌతోంది. అస్వస్థతకు గురవుతున్నారు. రెండు పూటలా ఫొటోలు తీసి మస్తరు నమోదు చేయాలంటూ మెలిక పెట్టడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ఎండలతో ఫొటో విధానాన్ని మార్చాలని కూలీలు డిమాండ్ చేస్తున్నా స్థానిక సిబ్బంది తామేమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. ఆచంట నియోజకవర్గం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల పెనుగొండ మండలం దేవలో నిర్వహిస్తున్న మంచినీటి చెరువు తవ్వకాల్లో దొంగరావిపాలెంకు చెందిన పిల్లి లక్ష్మి తీవ్ర అస్వస్థతతో గుండెపోటుకు గురై ఆసుపత్రిలో వైద్యం పొందుతునే మృతి చెందింది. వేసవిలో రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే ఇబ్బందులు పడాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నారు.

డిమాండ్లు ఇవీ..

పని ప్రాంతంలో నీడ కోసం టెంట్ వేయించాలి. తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలి. రెండు పూటలా ఫొటో విధానాన్ని రద్దు చేసి, ఉదయం 10.30 గంటలకే పని పూర్తి చేసే విధంగా నిబంధనలు సడలించాలి.

ఫొటో విధానం మార్చాలి



వేసవి ఎండల తీవ్రత ముందుగానే రావడంతో వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి. రెండు పూటలా ఫొటో విధానంలో మార్పు చేయాలి. తీవ్ర అస్వస్థతకు గురైన పిల్లి లక్ష్మి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.

– షేక్ పాదుషా, వ్యవసాయ కార్మిక సంఘం

మండుతున్న ఎండలు



వారం రోజులుగా ఎండల తీవ్రత బాగా పెరిగింది. పనులు చేయడానికి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. టెంట్ వేయడం, చల్లటి నీరు, మజ్జిగ పంపిణీ వంటివి ప్రారంభించాలి. కూలీలు ఎండ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

– కామన వరలక్ష్మి, మేట్, వదలి

17న విజయవాడలో మహాధర్నా


మాట్లాడుతున్న ఆంజనేయులు

పెనుగొండ : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న విజయవాడలో మహా ధర్నా నిర్వహించనున్నట్టు పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం ఆంజనేయులు తెలిపారు. బుధవారం పెనుగొండలో పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సంక్షేమానికి చేసిన జీవోలు లేదా హైకోర్టు తీర్పులు అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్న పంచాయతీల అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. ఏటా ఇవ్వాల్సిన యూనిఫామ్స్, చెప్పులు, కొబ్బరి నూనెలు, సబ్బులు సంవత్సరాలు గడుస్తున్నా ఇవ్వడం లేదని చెప్పారు. అవకాశం ఉన్న మేజర్ గ్రామాల్లోనూ పీఎఫ్ ఈఎస్ఐ సదుపాయం కల్పించడం లేదని తెలిపారు. వీటన్నింటి పరిష్కారానికి విజయవాడలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి


ముదునూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చదలవాడ మెర్లిన్. పాస్టర్లు

నరసాపురం: పార్టీ పదవులను బాధ్యతగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పార్టీ నరసాపురం నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన చదలవాడ మెర్లిన్ బుధవారం ముదునూరిని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తనకు నియోజకవర్గ స్థాయి పదవి ఇవ్వడం పై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పదవులు పొందిన నాయకులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. నిత్యం ప్రజల్లో వారికి అండగా నిలబడాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని ఆరోపించారు. మెర్లిన్ వెంట పాస్టరు చదలవాడ జ్ఞానప్రకాష్, వంగలపూడి జక్కరయ్య, అడిదల శరత్ ఉన్నారు.

సిద్ధాంతం లైన్‌మేన్‌కు అవార్డు

పెనుగొండ: లైన్‌మేన్ దివాస్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అవార్డును సిద్ధాంతం లైన్‌మేన్ మామిడిశెట్టి గణపతి భీమవరం సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజినీరు ఆలపాటి రఘునాద్ బాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈఈ కె.మధుకుమార్, డీఈఈ డి.రామకృష్ణలు తదితరులు గణపతిని సత్కరించారు. ఆ వివరాలను బుధవారం ఆయన సిద్ధాంతంలో వెల్లడించారు. ఈ సందర్భంగా గణపతిని పలువురు అభినందించారు.

రంజాన్ ఉపవాస దీక్షలు


జామియా మసీద్‌లో ఇఫ్తార్ స్వీకరిస్తున్న ముస్లింలు

పెనుగొండ: ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం నాలుగో రోజు పెనుగొండ జామియా మసీదులో గురువు మసీద్ ఆఫీజ్ దువా నిర్వహించి, ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. మగ్రీబ్ నమాజ్ నిర్వహించారు. షేక్ సుజాయుద్దీన్, షేక్ షరీఫ్, షేక్ నాగూరు మీరా, షేక్ మస్తాన్, షేక్ బాషా, డాక్టర్ షరీఫ్, షేక్ జాన్ మస్తాన్, షేక్ కాజాచ మెల్ల షాకీర్‌లు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

నరసాపురం : పట్టణంలోని పలు ఆలయాల్లో హుండీలను బుధవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. ఆదికేశవ ఎంబేరుమానార్ ఆలయ హుండీలో రూ.1,81, 201, మదనగోపాలస్వామి ఆలయంలో రూ.24,824, వెంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.36,092, సీతారామ స్వామి ఆలయంలో రూ.4908 ఆదాయం లభించినట్టు మొగల్తూరు గ్రూపు ఆలయాల కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పశువులకు టీకాలు

యలమంచిలి: మండలంలో ఉన్న 2325 ఆవులు, 6678 గేదెలకు ఈ నెలాఖరు వరకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేస్తున్నట్టు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. బుధవారం కాజ తూర్పు, ఊటాడ గ్రామాల్లో 70 ఆవులు, 258 గేదెలకు టీకా వేశామని చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కాజ పడమర, కొంతేరు గ్రామాల్లో పశువులకు గురువారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు టీకా వేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థికంగా బలపడాలి

పెనుగొండ: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన అన్నారు. బుధవారం పెనుగొండలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని కేక్ కట్ చేశారు. తల్లిగా, సోదరిగా, భార్యగా అన్ని బంధాలతో కుటుంబ వ్యవస్థమూలాధారంగా ఉన్న మహిళలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉష, మణిలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


పమ్మి బాబు మృతదేహం

పెనుగొండ : సిద్ధాంతం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధాంతం చెరువు పేటకు చెందిన పమ్మి బాబు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈతకోట ఫ్యాక్టరీలో విధులు నిర్వహించిన అనంతరం మోటార్ సైకిల్ పై వస్తూ సిద్ధాంతం శివారు సాయిబాబా ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చీకటిలో ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టాడు. బైక్ పైనుంచి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాద స్థలిలో బాబు తల్లిదండ్రులు లక్ష్మి, ప్రసాదులు రోధిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శిశువుల సంరక్షణపై అవగాహన

యలమంచిలి: ఆరోగ్యకరమైన శిశువులే దేశానికి నిజమైన సంపదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అన్నారు. శిశు సంరక్షణ విద్య కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె ఏనుగువానిలంక అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న పిల్లల తల్లులకు శిశువుల ఆరోగ్య సంరక్షణ చర్యలను వివరించారు. తల్లుల సమక్షంలో శిశువుల బరువు తూచి, శిశువుల బరువు పెరగడానికి తల్లులు ఏ విధమైన ఆహారం తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కెంసంధ్య, ఎంఎల్‌హెచ్‌పీ ఎం సాయిలక్ష్మి ప్రసన్న, అంగన్‌వాడీలు, బాలింతలు పాల్గొన్నారు.

నత్తనడకన గోకులం షెడ్ల నిర్మాణం


చామకూరిపాలెంలో గోకులం షెడ్డు

నరసాపురం రూరల్: మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నరసాపురం మండలానికి 48 షెడ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారు. రెండు గేదెల షెడ్డుకు రూ.1.15 లక్షలు, నాలుగు గేదెల షెడ్డుకు రూ.1.85 లక్షలు, ఆరు పశువుల షెడ్డుకు రూ.2.30 లక్షలు చొప్పున ఉపాధి హామీ నిధులు కేటాయించారు. లబ్ధిదారుని వాటా 10 శాతంగా నిర్ణయించారు. వీటిలో సుమారు 10 షెడ్ల నిర్మాణం పూర్తికాగా, బిల్లులు మంజూరుకాక పోవడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. చాలా వరకు షెడ్ల నిర్మాణం ప్రారంభం కాకపోగా, మరికొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

9న విగ్రహాల ప్రతిష్ఠాపన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కొత్తపేట వీరభద్రస్వామి గుడి వీధిలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నీలకంఠేశ్వరస్వామి, చౌడేశ్వరి దేవిల విగ్రహాల ప్రతిష్ఠాపన ఈ నెల 9న ఉదయం 10.52 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు వట్టం గణేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 8న స్వామి, అమ్మవార్ల విగ్రహాలను కలశాలు, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగిస్తామని పేర్కొన్నారు. విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం కలశాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలకు కలశం, పసుపు, కుంకుమ, గాజులు, కుంకుమ భరణి, సారె అందిస్తామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు భారీ అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని గణేశ్వరరావు కోరారు.